# అంతర్వాహిని

– శ్రీపతి



"ఒరేయ్ కోటీ"– కోటిగాడు తన వేపు చూడ్డం చూసి 'ఇట్రా ఇట్రా' అని గట్టిగా పిలిచాడు బస్సు డ్రైవర్.

"ఒరే కోటిగా–ఇట్రారా–రారా" అని కేకేసి పిలిచాడు కండక్టరు, డ్రైవర్ కంటే వయసులోనూ, సంపదలోనూ పెద్దతనమున్న ధైర్యంతో.

గొంతుచించుకొని అరుస్తేనేగాని వినిపించడంలేదు. వర్షం మోత అంత హెచ్చుగా వుంది. బస్టాండు చుట్టూ వున్న పట్టణాన్ని కప్పేసేంత దట్టంగా వున్నాయి వర్షపు తెరలు. ఏడాది పొడవునా పేరుకున్న మురికినంతటినీ పావుగంటలో కడిగేసింది వర్షం. సైడు కాలువలు పొంగిపోయాయి రోడ్డుమీదికి. ఎర్రని కొత్తనీరు పల్లానికి పారుతోంది.

బస్టాండు దగ్గర్లోనే పెద్ద మర్రిచెట్టుంది. ఆ చెట్టు మానుచాటున సగం తడిసి, అక్కణ్ణించి కదల్లేక నుంచున్నాడు కోటి. డ్రైవర్ పిలుపూ వినబడ్డది, కండక్టరు పిలుపూ వినబడ్డది. వాళ్ళని చూశాడుకూడా. కాని అక్కణ్ణించి కదల్లేదు.

బస్సుస్టాండుకు అనుకునే విశాలమైన పాతకాలవు హోటల్ వుంది. అక్కణ్ణించి హోటల్ యజమాని కృపాసింధు "వొరే వెధవా, తడుస్తున్నావ్, రారా" అని పిలిచాడు.


కృపాసింధువేపుకూడా చూశాడు. ఆ చెట్టుచాటునించి కదల్లేకపోయాడు. అటు దక్షిణానికి షెడ్డు, ఇటు పశ్చిమానికి హోటల్ పాతికగజాల దూరం లోనే వున్నాయి. కాని అక్కణ్ణించి కదిల్తేచాలు తడిసి ముద్దయిపోయేట్టు వున్నాడు. అంచేత కదల్లేదు.

వాడికి మనుషులంటే భయం పట్టుకుంది. వాళ్ళ దగ్గరకి వెళ్ళడమంటే బాధ, అందుచేతనే, ఆ పిరికితనంతోనే ఆ చెట్టుచాటున, ఆ తుంపర్లలో నానుతూ వర్షాన్ని చూస్తూ నుంచున్నాడు.

"హోటల్లో వెచ్చని కాఫీ చప్పరిస్తూ సారథి కోటిని చూశాడు. ఆశ్చర్యమూ, ఆనందమూ కలిగాయి. మళ్ళీ అంతలోనే ఆ ఉత్సాహం చల్లబడిపోయింది.

పిలిచి పిలిచి విసిగిపోయాడేమో కండక్టర్ "ఒరేయ్ దున్నపోతూ రారా" అన్నాడు పండ్లు కొరుకుతూ. అదే షెడ్డులోంచి "తడిసి చస్తున్న వెధవా, బుర్రలేదు? ఇక్కడికొచ్చి చావకూడదు?" అన్నాడు డ్రైవర్.

క్లీనర్ ఒంటి కన్ను నర్సింగులు వర్షపు జల్లులకు తడిసిపోయి వుంటున్న కోటిని చూసి ఒకటే పగలబడి నవ్వుతున్నాడు.



కైతలోన మిన్న కాటూరి వెంకన్న
లక్ష్మికాంతు డతడు సూక్ష్మబుద్ధి
ఒకరి కున్న కీర్తి ఒకరికి రాబోదు
జంటకవు లనెడి ప్రశస్తి తప్ప

ఆ షెడ్డులో ఇంకా జనం ఉన్నారు. అంతా బలంగానూ, మోటుగాను ఉన్నారు. అంతలో ఓ ఆడకుక్క ఎక్కడినుంచో ఎవరో కొట్టి తోలేస్తేనో, బాగా తడిసి తలదాచుకోడానికి లోపలికి వచ్చింది. అనారోగ్యంగా వున్న ట్టుంది. ఊగుతూ నడుస్తోంది. దాన్ని లోపలికి రానిచ్చి బూటుతో తన్నాడు డ్రైవర్. అది ఆ తావుకి అంతదూరంలో వర్షం నీటిలో పడింది. షెడ్డు గోడనుంచి ఊడుతున్న ఇటుక తీసి దానితో చావమోది అది దిక్కులేని ఆక్రందనతో పరుగుతీస్తే అంతా నవ్వారు. అక్కడ మనుషుల స్వభావానికి ఆ సంఘటన ఉదాహరణ.

ఆ కుక్క కుయ్యో, మొర్రో మంటూ హోటల్‌వైపు పరుగుదీయడం చూసి తననే హింసించినట్టుగా కోటి బాధపడ్డాడు.

"ఒరేయ్ దున్నపోతూ, గాడిదా తడిసి జ్వరం పెట్టుకునేవు! రారా షెడ్డులోకి" అని మరోసారి తిట్టి అసహ్యించుకొని పిలిచాడు కండక్టర్ కోటిని.

స్టాండ్‌లో వాళ్ళ బస్సు తడుస్తోంది. ఏడెనమండుగురు ప్రయాణీకులు ఆ బస్సులో వున్నారు. బస్సు కదలడానికి ఇంకా అరగంట టైముంది. ఈ అరగంట కాలక్షేపం కోసం కోటిని పిలవడం తప్పించి నిజంగా వాడిమీద అంత సానుభూతి ఉండి కాదు. తను ఆడించినట్టల్లా ఆడితే దానివల్ల మనిషి పొందే ఆనందం చాలా గొప్పది. చేప పిల్లల్ని ఒడ్డున వేసి అది కొట్టుకుంటుంటే చాలా ఇష్టం. తూనిగకి తాడుకట్టి వదలడం ఇష్టం. ఎలక్కి మువ్వకట్టి ఆడించడం సరదా. కుక్క మొఖాన్ని కుండలోపెట్టి వదిలితే అది వెర్రిపరుగులు తీస్తే చూడటం ఆనందం. మరి తను ఆడించినట్టల్లా ఆడే మనిషే దొరికితే ఇంక చెప్పనక్కరలేదు. కోటితో ఆడుకోవాలని వాళ్ళ సరదా. అంచేత వాళ్ళు పిలిచారు. కోటికది తెలిసి రాలేదు. రాకుండా ఉంటే ఊరుకోరు. వెళ్ళి లాక్కొస్తారు.

ఆ బస్సు స్టాఫ్ వాళ్ళంతా తిని వచ్చారు. కిళ్ళీలు బిగించి సిగరెట్టు కాలుస్తూ అక్కడ కూర్చున్నారు.

అప్పడే ఓ బస్సు వచ్చింది. కొంతమంది ప్రయాణీకులు దిగారు. షెడ్డు లోంచి కొందరు వెళ్ళిపోయారు. కొందరు లోపలికి వచ్చారు. ఆ వచ్చిన వాళ్ళలో ఒకాయన దగ్గర గొడుగుంది. "ఆ గొడుగు చూసి నర్సింగులు ఆ ఆడమనిషి తడిచిపోతున్నాది వెళ్ళి చెయ్యి సాయం చెయ్యరా" అన్నాడు కండక్టర్.

నర్సింగులు కండక్టరు ధోరణి అర్థం చేసుకున్నాడు. ఏ ఆట ఆడ మంటే ఆ ఆట ఆడే రకం కాదు. కావలిస్తే వాళ్ళతోపాటు ఎవరన్నా ఆడించడంలో తోడ్పడగలడు. అందుచేత ఆ పాతికేళ్ళ అమ్మాయి వర్షంలో తడిచిపోతూ అసహాయ పరిస్థితిలో ఉన్నప్పటికీ సాయం చెయ్యాలని లోలోపల కోరిక ఉన్నప్పటికీ, అలాంటి పరిస్థితిలో సాయం చెయ్యడం అవసరమని తెలిసినప్పటికి హీ, హీ, హీ అని నవ్వి వెళ్ళలేదు.

ఆమె తడిసిపోయింది. ఆమె నన్నటి గుడ్డలన్నీ ఒంటికి అంటున్నాయి. ఆమె బెడ్డింగ్ కింద నీటిలో పెట్టేయ్యాల్సి వచ్చింది. చివరికి ఆమే మోసుకుంటూ వెళ్ళింది హోటల్ పంచకి.

తర్వాత కండక్టర్‌కి ఓ ఉపాయం తోచింది. కోటిగాడ్ని తీసుకురమ్మని నర్సింగులుకి పురమాయించాడు. ఒక ప్రయాణీకుడి దగ్గర గొడుగు తీసుకుని ఇచ్చాడు. నర్సింగులు వెళ్ళి పిలిస్తే జడిసిపోయి కోటి జంకి వెన కడుగువేశాడు. గొడుగుచూపి పిలిచేసరికి దాంట్లో దూరాడు. నర్సింగులు మధ్యవరకు తీసుకెళ్ళి అక్కడ వర్షంలో కోటిని విడిచేసి తను గొడుగుతో షెడ్డులోకి పరుగుతీశాడు.

వర్షం కుండపోతగా ఉంది.

కోటికి కోపం, ఏడుపూ వచ్చి తిట్టాడు బూతులు. వెంటాడుతూ పరుగుతీశాడు.

"తగ్గరా కోటి, తగ్గు"

"తగ్గరా!"

"ఒరినీ కోపం మండా! వరదలా ముంచుకొచ్చిందే!"

"సచ్చిపోతున్నాడ్రా వెధవా– ఏమయిపోయిందిరా– ఇంతసేపూ వానేవు కదూ. ఇప్పుడు మొక్కయిపోతావా?"

"కోటి! నీళ్ళు పోసుకొని ఎన్నాళ్ళయిందిరా– ఎళ్ళి ఒక నిముషం తడువు ఒళ్ళు నల్లబడిపోతాది. కుళ్ళొదిలిపోతాది" అని మళ్ళీ అయిదారు చేతులు వర్షంలోకి నెట్టాయి.

కోటికి వళ్ళు మండింది. బలహీనులకి కోపం వస్తే ఏడుపుకూడా వస్తుంది. దాంతో ఏడ్చాడు.

వర్షంలో నానిపోతున్నాడు. వణికిపోతున్నాడు. ముందుకు రాలేదు. వెనక్కుపోలేదు. బాధ భరించలేకపోతున్నాడు. వర్షంలో రాయిలాగా నిలబడ్డాడు.

షెడ్డుముందు జరుగుతున్న దృశ్యం వర్షపు తెరల్లోంచి కనిపిస్తున్నది హోటల్‌లో వాళ్ళకి.

"కోటి! జోడు కడిగేయరా నాయిన్నాయనా, ఎలాగూ తడిసావుకదా?" అని కండక్టరు కోటి గుండెమీదకి దెబ్బ తగలాలన్నట్టుగా జోడు విసిరారు. ఆ జోడుకు అంటుకున్న బురద కాస్త కోటిగాడికి తడిసిన చొక్కాకు అంటుకుంది.

"ఇది కూడా" అని రెండోది విసిరాడు. కళ్ళల్లోంచి కన్నీరువలన, వర్షపునీరు కళ్ళలోకి కురుస్తుండటంవల్ల అలా రెండో జోడు తనమీదకి రావడం కనిపించలేదు కోటికి తిన్నగా. అది వచ్చి బుగ్గమీద గట్టిగా తగిలింది.

కోటి ఆ రెండు జోళ్ళు అందుకుని దూరంగా బలంగా విసిరేశాడు.

"నర్సింగులూ, కోటిగాడు ఆ జోళ్ళు విసిరేశాడు. హైస్కూల్లో పడిన ట్లున్నాయి వెళ్ళి తీసుకురా" అని కండక్టర్ నర్సింగులును తరిమాడు. నర్సింగులు ఎందుకు నవ్వుతున్నాడో తెలీదు. కానీ నవ్వుతూనే వెళ్ళిపోయాడు గొడుగేసుకుని.

ఈ అల్లరంతా సారథి, హోటల్లోంచి ఊగుతున్న వర్షపు జల్లులలోంచి చూస్తున్నాడు.

"ఎందుకలా హింసిస్తున్నాడు రాక్షసంగా?" అనుకున్నాడు బాధపడి మొదట్లో తనకు తెలిసిన వాడిలా కనపడ్డాడు. తరువాత కోటి పోలికలు దూరమైపోయినాయి. అయినా ఆ పోలికలున్నందువల్లనో లేక వాళ్ళు హింసిస్తున్నందువల్లో సారథికి జాలి కలిగింది.

కోటి గొణుక్కుంటూ మర్రిచెట్టుకిందకు వెళ్ళిపోయాడు. అక్కడ తడిసిన చొక్కాను పిండుకున్నాడు. ప్యాంటును మడతపెట్టుకున్నాడు. పిండిన చొక్కాతో ఒళ్ళు తుడుచుకున్నాడు. దిక్కులేని చూపులతో బాధపడుతూ ఆ చెట్టుచాటునే నించున్నాడు. కోటిమీద హోటల్ పంచన రిక్షాకోసం చూస్తున్న అమ్మాయికి సానుభూతి కలిగింది. బహుశా తడిసిన బాధవలన, అందరు మనుషులుండి సహకరించలేని పరిస్థితివలన మనుషులమీద కోపంతోను ఆ మనుషులు వాడిని హింసిస్తున్నందువల్ల వాళ్ళమీద అసహ్యంతోనే కోటిమీద ఆమెకు సానుభూతి కలిగి వుంటుంది.

భోరున కురుస్తూ నిముష నిముషానికి ఉధృతమవుతుంది వర్షం.

కోటి ఒంటిమీద చొక్కాలేదు. అనారోగ్యంగా ఉన్నాడు. పాతికేళ్ళు ఉంటాయేమో! పాపం ఎందుకో ఇంత దిక్కులేని స్థితి! తల్లిదండ్రీ లేరు కాబోలు. అన్నా, అక్కా లేరు కాబోలు. ఎవరూ లేరు కాబోలు. ఏమీ లేదు కాబోలు. తిండి ఎలాగ! నిద్ర ఎక్కడ! ఎవరేమి చేస్తారో! ఎలా బతుకుతున్నాడో! ఎవరు ఓదారుస్తారో! ఏమిటో పాపం ఇలాంటి బ్రతుకులకు అనుకుందామె... అంతలోనే వాళ్ళాయన బస్సు దగ్గరకు రానందుకు కోపం వచ్చిగాబోలు ఆలోచనలు ఇంకోవైపుకు వెళ్ళిపోయాయి.

తను అనుకున్న "తన మిత్రుడే" అయితే అలాగే ఉండనిచ్చేవాడా అనుకున్నాడు సారథి. మళ్ళీ తన మిత్రుడేనేమో ఇతడు అనుకున్నాడు.

నర్సింగులు జోళ్ళు రెండూ పట్టుకుని గొడుగున్నా వర్షపు ధాటికి తడిసి


**భారతదేశంలో సంతాన సాఫల్యతా వైద్య సేవలు అందించడంలో నూతన ఒరవడికి శ్రీకారం చుట్టి, పిల్లలు పుట్టక తిరిగి తిరిగి వేసారి పోయిన వేలాది దంపతులకు సకల సౌకర్యాలు ఒకేచోట కల్పించి, సాధ్యమయినంత మందికి సంతాన ప్రాప్తి కలగటానికి తోడ్పడుతూ "సంతాన కల్ప తరువు"గా వాసికెక్కిన**

**డా॥ రమా సంతాన సాఫల్య కేంద్రం వారి "విజయవాడ ప్రాంతీయ కేంద్రం" అక్టోబర్ 21న కాంధారి హోటల్ ఎదురుగా, హాట్‌బ్రెడ్స్ వెనుక, ఉ॥ 9-00 గం॥లకు శుభారంభం!**

**ఇక్కడ అన్ని ఆధునిక శాస్త్రీయ పరీక్షలు, చికిత్సా పద్ధతులతో పాటు IVF-ET (టెస్ట్‌ట్యూబ్ బేబి), GIFT-ZIFT, ICSI - Micro Manipulation పద్ధతులు మీకు అందుబాటులో ఉన్నాయి.**



పిల్లలు పుట్టకపోవడానికి కారణాలు అనేకం. ఈ కారణాలని సమగ్రంగా కనుక్కోవటానికి అవసరమైన వైద్య పరీక్షలన్నిటినీ ఒకేచోట ఏర్పాటు చేసి తగిన వైద్య సహాయం అందించటానికి 1991లో రాష్ట్రంలో ప్రప్రథమంగా ఒక సమగ్రమైన హాస్పిటల్‌ని "డా॥ రమా సంతాన సాఫల్య కేంద్రం" పేరుతో హైదరాబాదులో ప్రారంభించాము. అహర్నిశలు శ్రమించి ఈ కేంద్రాన్ని దేశంలోని, ప్రపంచంలోని అగ్రగామి కేంద్రాలలో ఒకటిగా రూపొందించాము. నేడు ప్రపంచంలో వైద్య విజ్ఞాన శాస్త్రానికి అందుబాటులో ఉన్న అత్యాధునిక పద్ధతులు అన్నీ మన కేంద్రంలో అందుబాటులో ఉన్నాయి.

ఎన్ని సాంప్రదాయ, శాస్త్రీయ వైద్య పద్ధతుల ద్వారా ప్రయత్నించినా పిల్లలు పుట్టని దంపతుల కోసం ఈ మధ్య కాలంలో అందుబాటులోకి వచ్చిన పద్ధతి - టెస్ట్ ట్యూబ్ బేబి పద్ధతి.

కాబోయే తల్లిని హార్మోన్ ట్రీట్‌మెంట్ ద్వారా ఒకటికి బదులు 5 నుండి 15 అండాలు విడుదల చేసేటట్లు చేసి, వాటిని జాగ్రత్తగా సేకరించి, శుద్ధి చేసిన భర్త వీర్య కణాలతో కలిపి, పిండోత్పత్తి జరిపి, లాబులోనే ఆ పిండాన్ని 24 నుండి 96 గంటల పాటు పెంచి, తల్లి గర్భంలో ప్రవేశ పెట్టడమే ఈ విధాన సారాంశం. టెస్ట్ ట్యూబ్ బేబీకై వివిధ పద్ధతులతో సహా ICSI- మైక్రో మ్యానిపులేషన్ అన్న సాంకేతిక పద్ధతిని మీకు మన రాష్ట్రంలో మొదటిసారిగా అందుబాటులోకి తెచ్చాం. ఈ పద్ధతిలో అతి తక్కువ స్పెర్మ్‌కౌంట్ ఉన్నవారి నుండీ, పూర్తిగా స్పెర్మ్ కౌంట్ లేకున్నా వారి టెస్టిస్ లోపల ఏ కొద్దిగా స్పెర్మ్ కణాలు ఉన్నా, వాటిని బయటకి తీసి వేరుగా అండంలోకి పంపి పిండోత్పత్తి జరుపుతారు. హైదరాబాదులో రెండు దఫాలుగా మొత్తం 7 రోజులు ఉంటే చాలు. అందులోనూ భర్త 2 రోజులు ఉన్నా సరిపోతుంది.

ఈ చికిత్సా విధానాలకు అవసరమైన వైద్య విజ్ఞాన పరికరాలను, ప్రతి కేసుకి వాడే డిస్పోసబుల్స్‌ను, మీడియాను ప్రపంచమంతటి నుండి దిగుమతి చేసుకొని, అందించే సేవల్లో ఎక్కడా రాజీ పడకుండా సంతాన ప్రాప్తికై కృషి చేస్తున్నాం. మీరూ - మేమూ కలిసి ప్రయత్నిస్తే మీరు అంతర్జాతీయ స్థాయిలో వైద్య సలహా సహాయాలను పొందవచ్చు.

**సూచనలు :** ● ఒక సంవత్సర కాలం కావాలనుకున్నా సంతానం కలుగని దంపతులు వెంటనే సంప్రదించడం ఉత్తమం. ● మొదటిసారి ఇక్కడకు వచ్చే దంపతులు ఋతుక్రమం మొదలైన 13వ రోజు నుండి 3 రోజులు రావాలి ● వచ్చే ముందు 5 రోజులు భార్యా భర్తలు దూరంగా ఉండాలి. ఒకటి, రెండు సార్లు గర్భస్రావం జరిగిన వాళ్ళు మళ్ళీ గర్భధారణ కోసం ఆగకుండా తప్పనిసరిగా ముందుగానే రావాలి. ● వివాహం జరిగాక కూడా ఋతుక్రమం సరిగాలేని వాళ్ళు తక్షణం సంప్రదించాలి. లేకపోతే తీరని నష్టం జరగవచ్చు. ● తమ పాత రిపోర్టులన్నీ తెచ్చుకోవాలి.

*కృషితో నాస్తి దుర్భిక్షం! ప్రయత్నే ఫలీ!!*

**డా॥ రమా సంతాన సాఫల్య కేంద్రం**

(A Unit of Diana Medical Services Pvt. Ltd.)

గోల్డ్ స్పాట్ కంపెని ఎదురుగా, అమీర్‌పేట్, హైదరాబాదు - 500 016. ఫోన్లు : 33 11 255, 331 2294. Email : sunflori/hyderabad @ dartmail, dartnet.com

రాజమండ్రి ప్రాంతీయ కేంద్రం : మారుతీ గ్యాస్ ఏజన్సీ కాంపౌండ్, జయకృష్ణాపురం, కంభాల చెరువు, రాజమండ్రి. ఫోన్ : 76693, ఫ్యాక్స్ : 76693.

పోతూ షెడ్డు చేరుకున్నాడు. నవ్వుతున్నాడు. ఎక్కడ పడ్డాయనుకున్నావు? ఆ వరండాలో ఒకటి, జెండా కొయ్య దగ్గర ఇంకోకటి. కోటిగాడికి మంచి బలముందే. అని వాడినవ్వు.

నర్సింగులు తడిసిపోయావురా అని కండక్టరు జాలి చూపించేడు. మళ్ళీ అంతలోనే "ఆ, ఎలాగూ తడిశావుగదా గొడుగు బాబుకిచ్చేసి దొంగచాటుగా వెళ్ళి, ఆ పిండుకున్నాడు చూడూ– ఆ చొక్కా పట్టుకొచ్చే" అని మరొక సిగరెట్టు వెలిగించాడు.

చెట్టు చాటున నక్కి నర్సింగులు వెళ్ళడమూ, గద్దలా ఆ పిండుకున్న చొక్కా ఎత్తుకుపోవడమూ, కోటి వెంబడే తెగించి పరుగెత్తడమూ, వర్షంలో తడిసి షెడ్డు చేరుకోవడమూ, నర్సింగులు తన చేతిలోని చొక్కాని కండక్టరు చేతిలో పెట్టి డ్రైవర్ చాటున మంచోవడమూ, తిట్టుకుంటూ డ్రైవర్ని ఓ పక్కకి నెట్టేసి "ఎముకలు చితగ్గొడతానుండు గుడ్డి వెధవా! దొరక్కపోతావా! ఈ డ్రైవరూ రక్షించలేడు– ఆ కండక్టరూ రక్షించలేడ్రా– ముందు చొక్కా యివ్వవో' ' అని కండక్టరు మీద పడ్డమూ, కండక్టరు చొక్కాని డ్రైవర్వైపు విసురుతున్నట్లుగా నటించి బయటి వర్షం బురద నీటిలోకి విసిరేయడమూ కళ్ళు మూసి తెరిచినంతలో జరిగిపోయాయి.

కోటికెంత కోపమొచ్చిందో మరి, "ఇదిగో ఈ పేంట్కూడా విసిరేయండ్రా" అని బొత్తాములు విప్పేయబోయాడు.

"విప్పరా, విప్పరా" అన్నాడు నర్సింగులు, కుక్క కుయ్యోమొర్రోమని ఏడుస్తుంటే నవ్వినట్లుగా నవ్వాడు.

కోటి ఈసారి బయటికే ఏడిచేశాడు. ఆ చొక్కా పట్టుకుని మర్రిచెట్టు కిందకెళ్ళిపోయాడు.

వర్షం హోరున కురుస్తోనే ఉంది.

అంతలో ఓ రిక్షా వచ్చి ఇద్దర్నీ హోటల్లో దించి ఆ అమ్మాయిని ఎక్కించుకుని వెళ్ళిపోయింది.

ఐదు నిమిషాలు గడిచాయి. మళ్ళీ కోటి చొక్కా పిండుకున్నాడు. వొళ్ళు తుడుచుకున్నాడు. తల ఒత్తుకున్నాడు. అలసటతోనే నుంచున్నాడు మర్రిచెట్టుచాటున.

"బాబూ, గొడుగొకసారియ్యండి. యివ్వడే పంపిస్తా" అని కండక్టరు పాసింజర్ దగ్గర గొడుగు తీసికొని .స్టాండులో నిలచిన నీళ్ళను తన్నుకుంటూ మర్రిచెట్టుకిందికి కోటి దగ్గరికి వెళ్ళాడు. కండక్టరుని చూట్టంతోనే గజం వెనక్కి తగ్గాడు కోటి.

"నేనేమీ చేయన్రా– తల్లితోడు– నేనేమీ చేయన్రా– తల్లితోడంటే నమ్ము. రారా, ఇంద. గొడుగులోకి రా, టిఫిన్ చేద్దువుగాని! రారా" అని ప్రేమ ఒలికే పలుకులు వినబడేసరికి కోటికి తియ్యని ప్రాణమొచ్చినట్టయింది. 'తల్లితోడు' అనేసరికి కండక్టరు మాటలమీద అనంతమైన విశ్వాసం ఏర్పడిపోయింది. "టిఫిన్ చేద్దువుగాని" అనేసరికి వాళ్ళు పెట్టిన హింసంతా మాయమైపోయింది. జాలి చూపులు చూశాడు. దిక్కులేని చూపులవి ఆకలి చూపులవి.

ఆ చూపులకి కండక్టరు మరింత కరిగిపోయాడు.

కాఫీ హోటల్లో ఎవర్నీ చూడలేదు కోటి. వెళ్ళి కండక్టరుతో ఓ మూల కూర్చున్నాడు.

కండక్టరు కావలసినవన్నీ అడిగి, బలవంతం చేసి కడుపునిండా తినిపించాడు. కోటి కడుపు నిండిపోయింది.

డ్రైవర్ అంతలో వచ్చి "ఆ బాబు గొడుక్కావాలంటున్నారు" అన్చెప్పి కండక్టర కోటికి టిఫిన్ తినిపించడం చూసి, తనకి ఇష్టంచాలి అనిపించి "ఒరే కోటి! నా వొంతు నాలుగు పెరుగ్గారెలు–" అని సర్వర్కి ఆర్డరిచ్చి కోటి పక్కనే కూచున్నాడు.

డ్రైవర్కీ, కండక్టరుకి కోటిమీద జాలి కలగటానికి కారణాలు ఉన్నాయి. వాళ్ళిద్దరిది ఆ ఊరు కాదు కాని బస్సు నైట్హాల్ట్ ఆ వూళ్ళోనే అందుచేత వాళ్ళు అక్కడే అద్దె ఇళ్ళలో ఉన్నారు. ఆ ఇళ్ళలో అవసరాలన్నీ మార్కెట్నుంచి తీసుకుపోయి ఇవ్వడం, కబుర్లేమన్నా ఉంటే చెప్పడం, బస్సునుంచి తీసుకెళ్ళాల్సినవేవన్నా ఉంటే తీసుకెళ్ళడం కోటి పని. ఆ రకంగా వాడొచ్చినప్పటినుంచీ ఆ స్టాండులోని బస్స్టాఫ్ వాళ్ళకి పనికివచ్చినవాడయ్యాడు. ఒక్కోసారి ఒక్కోరు భోజనానికి తీసుకెళ్తారు. లేకపోతే టిఫిన్కి డబ్బులిస్తారు. లేకపోతే తాము తినే దాంట్లోనే కొంచెమిస్తారు. వాడు వచ్చి సంవత్సరమవుతున్నప్పటికీ అలాగే బతుకుతున్నాడు. ఒక్కోసారి ఒకటి రెండు దినాలు ఏ లారీలోనో, ఏ డ్రైవరుతోనో వెళ్ళిపోయి వస్తుంటాడు. వాడికి ఇల్లులేదు. వాకిలి లేదు. వాడికి ఎవరున్నారో, ఎవరు లేరో తెలీదు. ఎవరికీ చెప్పలేదు. ఎవరూ తెలుసుకోవాలని ప్రయత్నం చెయ్యలేదుకూడా. భార్య చచ్చిపోయిందని, కొడుకు చచ్చిపోయాడని, తమ్ముడునన్నాడనీ, తమ్ముడి దగ్గరే తల్లి వున్నదని, వాళ్ళంతా చాలా దూరంలో సుఖంగానే వున్నారని చెప్పడానికి వాడికి సిగ్గు, అభిమానము. అందుచేత చెప్పుకోలేదు. తన అసమర్థతనంతా అసహ్యించుకున్నారు. అంచేత అతడికి తన గురించి చెప్పుకోవడం కూడా భయమే.

డ్రైవరు బలవంతం చేస్తోంటే, "కడుపు నిండిపోయింది. ఇంక తిన్లేను" అన్నాడు భయం భయంగా.

"సరిసర్లే. తిను తిను తండ్లేకపోతే" అని అభిమానం కూడా మెత్తగా మంచిగా ప్రకటించలేని డ్రైవర్ బలవంతం చేశాడు. తిట్టి కొట్టి, తన్ని ఎలాగయినా తినిపించేట్టున్నాడు డ్రైవర్. విడిచి పెట్టేస్తే ఊరుకోడు. తింటోంటే డోకు వచ్చినట్లు అవుతోన్నా తింటున్నాడు కోటి.

వర్షం జలమయం చేసేసింది ప్రకృతిని.

కోటి తింటూ తింటూ డోకువచ్చి బయటకి వెళ్ళి పంచన వాంతి చేసుకున్నాడు. డ్రైవర్ ఇన్ని నీళ్ళు ఇచ్చాడు కోటికి. నోరంతా చేదు చేదు అయిపోయింది. నరాలన్నీ వణికిపోతున్నాయి. తలనొప్పి మొదలైంది. కాళ్ళు కంపించి పోతున్నాయి. నీరసంగా పంచనగోడకి చేరగిలపడి కూలబడ్డాడు.

బస్సు వేళయి కండక్టరూ, డ్రైవరూ వెళ్ళిపోయారు. కృపాసింధుతో ఏమిటో చెప్పినట్టున్నారు.

ఇంకో బస్సు వచ్చి ఆగింది. జనం దిగారు వర్షంలోనే.

ఆకాశం నల్లని మేఘాలతో నిండిపోయి జోరుగా వర్షం కురుస్తోంది.

ప్రవాహం కడిగేసింది. కోటి ఆకలి తీర్చిన ఆహారాన్నంతటినీ.

కోటి చూపులు నీరసంగా వున్నాయి. కళ్ళు తెరవడం బాధగా వుంది. అక్కడే పడిపోయి నిద్రపోవాలని వుంది. కాని పంచంతా తడిసిపోయి ఉంది. ఆ నీరసమైన చూపులకే ఎదురుగా బస్సుదగ్గర్లో ఏభైయేళ్ళ ఒకామె కనబడింది వానలో తడుస్తోంది. ఆమెతోపాటు బరువుంది. ఆ బరువు మోయటానికి ఎవరూ కనిపించలేదు. కింద నీరు, మెరగ్గా ఉన్న దగ్గర ఒక మూట పెట్టి ఇంకో మూట గుండెల్లో దాచుకుంది.

కోటి ఆమెని చూసి, ఆమె పరిస్థితి అర్థం చేసుకుని వెళ్ళి, ఆమె మూట అందుకుని "రా అమ్మా రా, ఆ పంచలోకి రా" అని ఆమె కళ్ళల్లోకి విచిత్రంగా, వింతగా, కొత్తగా, ఆశతో, భక్తితో చూసి హోటల్వైపు నడిచాడు.

** **** **

బస్ కదిలిపోయే ముందు సారథికి అనిపించింది. తను ఎందుకు కోటికి సహాయం చేయలేకపోయాడు? వాడు తెలిసికూడా తెలియనట్టు ఎందుకు నటించాడు? డిస్ట్రిక్ట్ ట్రెజరీ ఆఫీసులోని రామ్మూర్తి అన్నయ్యేగదా కోటి? అయినా తను ఎందుకు పలకరించలేకపోయాడు?

"ప్రపంచంలో చాలామంది కష్టపడుతున్న వాళ్ళున్నారు" అని తనని తాను సంతృప్తిపరుచుకున్నాడు. కొంతసేపు మానసికంగా బాధపడిన తర్వాత సారథి.